టీజీపీఎస్సీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం నాంపల్లిలోని కమిషన్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్వీస్ కమిషన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

టెన్త్‌లో సెమిస్టర్ సిస్టం!

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతిలో సెమిస్టర్ విధానాన్ని తీసుకువచ్చేందుకు యోచిస్తున్నది. ఏడాదికి రెండుసార్లు పరీక్షలు నిర్వహిస్తే ఎలా ఉంటుందనే అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నది. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలను మార్చి, ఏప్రిల్ నెలల్లో ఒకేసారి నిర్వహిస్తున్నారు. దీంతో ఒకేసారి సిలబస్ మొత్తం చదివి పరీక్షలు రాయాల్సి రావడంతో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పిల్లలపై ఒత్తిడిని తగ్గించేందుకు ఆరు నెలలకోసారి పరీక్షలు పెడితే ఎలా ఉంటుందన్న దానిపై అధ్యయనం చేస్తున్నది. సెమిస్టర్ విధానంపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావేత్తల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నది. విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఈ నెల 2న ఖమ్మం జిల్లా కుసుమంచి, జీళ్ల చెరువు హైస్కూళ్లను సందర్శించిన సందర్భంలో ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంలో శుక్రవారం మరో అల్పపీడనం ఏర్పడనున్నట్టు వాతావరణశాఖ వెల్లడించింది. దీని ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాలో వాతావరణం మేఘావృతమై ఉంటుందని, పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురుస్తుందని తెలిపింది. ఈనెల 6,7 తేదీల్లో ఏర్పడే ఆవర్తనం దక్షిణ దిశగా పయనించే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. అటు ఫెంగల్ తుఫాను బలహీనపడి అల్పపీడనంగా మారి అరేబియా సముద్రంలోకి ప్రవేశించింది.

నటుడు అల్లు అర్జున్‌పై కేసు

- సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో రేవతి మృతి
- ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు
- ప్రీమియర్ షోకు అల్లు అర్జున్ వస్తున్నట్టు సమాచారం లేదన్న డీసీపీ
- టీ లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడి ఫిర్యాదు
- కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్
- ఏడాది క్రితం భర్తకు లివర్ ఇచ్చి కాపాడుకున్న రేవతి
- అల్లు అర్జున్ బాధ్యత వహించాలి
- సీనియర్ న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి

నాంపల్లి/ఖైరతాబాద్/చిక్కడపల్లి, క్రిమినల్ కోర్టులు, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటకు సంబంధించి కేసు నమోదైనట్టు సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్షయాదవ్ తెలిపారు. ఈ ఘటనలో మృతి చెందిన రేవతి భర్త భాస్కర్ ఫిర్యాదు మేరకు అల్లు అర్జున్, ఆయన సెక్యూరిటీ, థియేటర్ యాజమాన్యంపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. గురువారం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ ప్రీమియర్ షోకు అల్లు అర్జున్ వస్తున్నట్టు తమకు ఎలాంటి సమాచారం లేదని స్పష్టం చేశారు. మరోవైపు, ఇదే ఘటనపై అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్, నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్‌పై తెలంగాణ లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు తిరుపతివర్మ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రిది బాధ్యతా రాహిత్యం

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటకు ప్రభుత్వంతోపాటు నటుడు అల్లు అర్జున్, నిర్మాణ సంస్థ బాధ్యత వహించాలని న్యాయవాది పీ శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ సతీశ్ కమాల్, సినీ నిర్మాత కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. బెనిఫిట్ షోల విషయంలో ప్రభుత్వం, ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించారని విమర్శించారు. నిజానికి బెనిఫిట్ షో డబ్బులు చారిటీకి ఇవ్వాలని, మరి ఈ డబ్బులు ఏమయ్యాయో లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. తొక్కిసలాట ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారంతోపాటు వారి కుమారుడి చదువు బాధ్యతలు అల్లు అర్జున్ చూసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం కోసం అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తామని చెప్పారు.

భార్య రేవతి, కుమారుడు, కుమార్తె తో భాస్కర్ ఫైల్ ఫోటో..

అభిమానంతో ప్రాణాల మీదికి..

థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో గాయపడి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న శ్రీతేజ్ (13)కు అల్లు అర్జున్ అంటే ఎనలేని ఇష్టం. అదే ఇప్పుడు అతడి ప్రాణాల మీదకు తెచ్చింది. పుష్ప-2 ప్రీమియర్ షో చూడాలని కుమారుడు పట్టుబట్టడంతో తండ్రి భాస్కర్ రూ.1100 చొప్పున టికెట్లు కొని భార్య రేవతి, కుమారుడితో కలిసి వెళ్లారు. థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి మృతి చెందగా, శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉంది. ఏడాది క్రితం భాస్కర్ అనారోగ్యానికి గురైతే రేవతి తన కాలేయాన్ని ఇచ్చి కాపాడుకుంది. ప్రాణాపాయం నుంచి భర్తను కాపాడిన ఆమె ఇప్పుడిలా మృతి చెందడంతో అది తలచుకుని కుటుంబ సభ్యులు, బంధువులు విలపిస్తున్నారు.

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

ఓబీసీలకు క్రీమీలేయర్ రద్దుచేయాలి

- ఢిల్లీ ఏఐవోబీసీ ధర్నాలో మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓబీసీలకు క్రీమీలేయర్‌ను రద్దు చేయాలని తెలంగాణ మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆలిండియా బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్రం త్వరలో చేపట్టే జనాభా లెక్కల్లో కులగణన చేర్చాలని, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించాలని, ప్రమోషన్లలో రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవ్యవస్థ, ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లను అమలు చేయాలని, ఓబీసీ సంక్షేమానికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

సిరిసిల్లకు పొంగల్ చీరల ఆర్డర్లు

- బతుకమ్మ చీరలు లేక నేతన్న దిగాలు
- జీవం పోస్తున్న తమిళనాడు 'అమ్మ చీర'

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 5 (నమస్తేతెలంగాణ): ఎప్పటిలాగే ఈ సారి పొంగల్ చీరల ఆర్డర్లు వచ్చేశాయి. తమిళనాడు ప్రభుత్వం ఇచ్చిన చీరలతో సిరిసిల్ల నేతన్నకు ఊరట లభించింది. బతుకమ్మ చీరల బంద్‌తో మూతపడ్డ వస్త్ర పరిశ్రమకు 'అమ్మ చీర' జీవం పోసింది. తమిళనాడు ప్రభుత్వం ఏటా ఆర్డర్లు ఇక్కడికే ఇస్తూ వస్తున్నది. సుమారు 15 ఏండ్ల క్రితం లక్ష మీటర్ల ఆర్డర్లు ఇచ్చిన అక్కడి ప్రభుత్వం నేడు కోట్లకు చేరింది. అమ్మ చీరల పేరుతో సంక్రాంతికి (పొంగల్) పంపిణీ చేస్తున్నది. పురుషులకు పంచె, శెల్ల పంపిణీ చేస్తుండగా వాటి ఆర్డర్లు సైతం సిరిసిల్లకే అత్యధికంగా ఇస్తున్నది. రెండు కోట్ల మీటర్ల బట్టతో 30 లక్షల చీరలు మూడు వేల సాంచాలపై తయారవుతున్నాయి. 5.50 మీటర్లవి 40 రంగుల్లో తయారు చేస్తున్నారు. రోజూ రెండు లక్షల మీటర్ల వస్త్రాలు తయారు చేస్తున్నారు. వీటిని ఎప్పటికప్పుడు తమిళనాడుకు తరలిస్తున్నారు. ఈ చీరల తయారీతో వెయ్యి మందికి ఉపాధి లభిస్తున్నది. ఇందులో నేత కార్మికులు, వైపనీ, వార్పిన్, హమాలీ, ప్యాకింగ్, గుమస్తాలకు చేతినిండా పని దొరికింది. పొంగల్ చీరల తయారీతో నెలకు రూ.10 వేల నుంచి రూ.13 వేలు వస్తున్నట్టు కార్మికులు తెలిపారు.

సాంచాలపై తయారవుతున్న అమ్మ చీరలు

అక్షరం మారిందని.. రుణమాఫీ ఆపిండ్రు

- మహిళా రైతు బొల్లంపెల్లి సుజాత ఆవేదన

సుజాత

లింగాలఘనపురం, డిసెంబర్ 5 : నా ఆధార్ కార్డులో ఉన్న పేరు.. వ్యవసాయ శాఖ రికార్డులో ఉన్న పేరు ఒక్కటే. కేవలం ఇంటిపేరులో రెండక్షరాలు తేడాగా ఉన్నాయి.. కేసీఆర్ సారు హయాంలో ఈ ఆధార్ కార్డుతోనే ఏడుసార్లు రైతు బంధు డబ్బులు ఠంచన్‌గా పడ్డాయి. రుణమాఫీ కూడా జరిగింది. ఇప్పుడు ప్రభుత్వం మారింది.. నా పేరులో తప్పుందని రుణమాఫీని ఆపింది. నేను జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నవాబుపేటలోని కెనరా బ్యాంకులో రూ. 40 వేలు పంట రుణం తీసుకున్నా. నా ఆధార్ కార్డులో ఇంటిపేరు బొల్లంపెల్లిలో పీఈఎల్ఎల్‌వై ఉండగా, వ్యవసాయశాఖ ఆన్‌లైన్ రికార్డుల్లో మాత్రం పీఏఎల్ఎల్ఐ (పల్లి)గా ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వాల ఎట్లిచ్చిండ్రు.. ఇప్పుడెందుకు ఇత్తలేరో తెలియడంలేదు అంటూ సుజాత తన ఆవేదన వ్యక్తంచేసింది.